సాక్షి జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



గల్లాపెట్టె గలగల..

శాసనసభ ఎన్నికలు టీఎస్ ఆర్టీసీకి కలిసొచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వలస ఓటర్లు గ్రామాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇది ఆర్టీసీకి లాభాలు ఇచ్చింది. - 8లో▸



ముమ్మరంగా పోలీసు తనిఖీలు

మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేశారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం $32^0/21^0$

వాతావరణం

జిల్లావ్యాప్తంగా ఉదయం వాతావరణం ఆహ్లాదరకంగా ఉంటుంది. మధ్యాహ్నా సమయంలో ఎండ ఉంటుంది. రాత్రి చలితీవ్రత పెరుగుతుంది.

నేడే ఓట్ల లెక్కింపు

ఉత్కంఠకు కొన్ని గంటల్లో తెర

- ఉదయం 8గంటల నుంచి ప్రారంభం
- భూపాలపల్లి పట్టణంలో పూర్తయిన ఏర్పాట్లు
- కౌంటింగ్‌కు 14 టేబుళ్లు..
- ప్రతి 20 నిమిషాలకు ఒక రౌండ్ ఫలితం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి నియోజకవర్గ ఓటర్లు ఎవరికి పట్టంగట్టారో నేడు తేలిపోనుంది. ఉదయం 8గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కౌంటింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేయగా.. ప్రతి 20 నిమిషాలకు ఒక రౌండ్ ఫలితం వెల్లడికానుంది. తొలి నాలుగు రౌండ్లలో భూపాలపల్లి పట్టణ, భూపాలపల్లి మండల ఓటర్ల లెక్కింపు ఉండడంతో వాటిలో వచ్చిన మెజార్టీతో పార్టీలు జయాపజయాలపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంది. కౌంటింగ్ కేంద్రం వద్ద 300మందితో మూడంచెల భద్రత ఏర్పాటుచేశారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన లెక్కింపునకు పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలోని సింగరేణి మినీ ఫంక్షన్‌హాల్ వేదిక కానుంది. మంథని నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పెద్దపల్లి జిల్లాకేంద్రంలో జరగనుంది.

ఏర్పాట్లు పూర్తి..

భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని సింగరేణి మినీ ఫంక్షన్‌హాల్‌లో కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. ఇందుకోసం అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలు, కౌంటింగ్ టేబుళ్లు, వెలుతురు కోసం లైట్లను ఏర్పాటుచేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కౌంటింగ్, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖరే ఇప్పటికే పర్యవేక్షించారు. ఏర్పాట్లను ఇదివరకే భూపాలపల్లి ఆర్‌ఓ రమాదేవి పరిశీలించారు. ఇప్పటికే కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను పటిష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాన్ని మూడంచల భద్రతతో సిబ్బంది పహారా కాయనున్నారు.

మధ్యాహ్నం 2గంటల వరకు పూర్తయ్యే చాన్స్..

భూపాలపల్లి నియోజకవర్గంలో 317 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను 23 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ప్రతీ 20 నిమిషాలకు ఒక రౌండ్ చొప్పున ఫలితాలు వెలువడనున్నాయి. దాదాపుగా మధ్యాహ్నం రెండు గంటల వరకు ఫలితాలు పూర్తి కానున్నాయి. కౌంటింగ్ కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సిబ్బందికి శనివారం శిక్షణ ఇచ్చారు. ప్రతీ టేబుల్‌కు నలుగురు సిబ్బంది చొప్పున 56మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఓట్ల లెక్కింపును ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులు పరిశీలించనున్నారు. ఈవీఎంలలోని ఓట్ల సంఖ్య, వీవీప్యాట్ స్లిప్పులలోని ఓట్ల సంఖ్య సమానంగా ఉన్నదో లేదో తెలుసుకోవటానికి ఏదో ఒక బూత్‌లోని వీవీప్యాట్ స్లిప్పులను కూడా లెక్కించనున్నారు.



కౌంటింగ్ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



కౌంటింగ్ హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



కౌంటింగ్‌పై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

తొలి నాలుగు రౌండ్లు భూపాలపల్లి పట్టణం..

భూపాలపల్లి నియోజకవర్గంలో కీలకమైన పట్టణ ఓట్ల లెక్కింపు తొలి నాలుగు రౌండ్లలోనే ముగియనుంది. దీంతో పాటు భూపాలపల్లి మండలం సంబంధించిన ఓట్ల లెక్కింపు కూడా ఐదవ రౌండ్‌తో ముగియనుంది. ఐదు రౌండ్లలో వచ్చే మెజారిటీతో ఎవరు గెలువబోతున్నారనే విషయంపై అంచనా వచ్చే అవకాశం ఉంది. కౌంటింగ్ టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి(బి)తో ప్రారంభమై శాయంపేట మండలం సూరంపేట శివారు గట్ల కనపర్తితో ముగియనుంది. తొలి రెండు గంటల్లోనే ఓటింగ్ సరళిపై అందరికీ స్పష్టత రానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా వచ్చిన ఓట్లను అధికారులు లెక్కించనున్నారు. ఆ తరవాతే ఈవీఎంలను తెరవనున్నారు. దీంతో మొదటి రౌండ్ ఫలితాలు వచ్చేసరికి సుమారు అరగంట సమయం పట్టే అవకాశం ఉంది.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: నేడు (ఆదివారం) భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ భవేష్‌మిశ్రా పరిశీలించారు. కౌంటింగ్‌పై వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 317 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,24,432 ఓట్లు (82.02) శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి కౌంటింగ్ మొదలవుతుందని మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారని చెప్పారు. 1,345 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 3 టేబుల్స్ ఏర్పాటుచేసి వాటిని లెక్కించనున్నట్లు చెప్పారు. ఉదయం 8:30 నుంచి ఈవీఎంల ద్వారా నమోదైన ఓట్లను లెక్కించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ప్రత్యేకమైన చాంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు అక్కడి నుంచి కౌంటింగ్ విధానాన్ని పరిశీలించవచ్చన్నారు. ఉదయం 7గంటల లోపు అందరూ కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని.. ఆ తరువాత ఎవరినీ లోనికి అనుమతించేది లేదని చెప్పారు. కౌంటింగ్‌లో రౌండ్ పూర్తవుగానే కౌంటింగ్ ఏజెంట్ల సంతకం, రిటర్నింగ్ ఆఫీసర్ సంతకం తీసుకొని మీడియాకు రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. మీడియా కోసం ప్రత్యేకమైన గ్యాలరీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ హాల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర బలగాలతో మూడంచల భద్రత ఏర్పాటు చేయనునట్లు తెలిపారు. కౌంటింగ్ హాల్‌లో జరుగుతున్న వ్యవహారాన్ని సీసీటీవీల ద్వారా నిరంతరం ఎలక్షన్ కమిషన్ అధికారులు పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమాదేవి, ఎన్నికల నోడల్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో కార్తీక శోభ

- రూ. 3.32లక్షల ఆదాయం

కాళేశ్వరం: కార్తీకమాసం సందర్భంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం స్వామి వారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలలో మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద లక్షవత్తులు వెలిగించారు. దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించారు. శనివారం కావడంతో శ్రీసుబ్రహ్మణ్యస్వామి వద్ద కాలసర్ప, నవగ్రహాల వద్ద శని నివారణ పూజలు భక్తులు అధిక సంఖ్యలో నిర్వహించారు. దీంతో ఆలయానికి వివిధ పూజలు, లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా ఒక రోజులోనే రూ.3.32లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆలయంతో పాటు గోదావరి తీర పరిసరాల్లో కార్తీకశోభ కనిపించింది.



గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు



ఉసిరి చెట్టు వద్ద లక్షవత్తులు వెలిగించిన భక్తులు



కాలసర్ప నివారణ పూజలు చేస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదానం

కాటారం: కాటారం మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలాధారణ భక్తుల కోసం నిత్యన్నదానం కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది సైతం మాలాధారణ భక్తులకు దాతల సహకారంతో 45 రోజుల పాటు అన్నదానం చేయనున్నారు. భక్తులు, దాతలు సహకరించి అన్నదానం కోసం తమ వంతు సహకారం అందించాలని ఆలయ నిర్వాహకులు బచ్చు అశోక్‌గుప్త, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

శ్రీధర్‌బాబు విజయం కోసం పూజలు



మల్హర్: మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజయం సాధించాలని కోరుతూ మండలంలోని కొయ్యూరు నాగులమ్మ దేవాలయంలో శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఏనుగు నాగరాణి, నాయకులు గుంటి సమ్మక్క, వేల్పుల రజిత, ఎడ్ల పోసక్క, వేల్పుల కమల, కొండ రాజమ్మ, ఎడ్ల లక్ష్మి, సునీత, రామచంద్రం, సమ్మయ్య, రమేష్, హరీశ్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి



గోవిందరావుపేట: హెచ్ఐవీ బారిన పడిన వ్యక్తులు వివక్షకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకుసాగుతూ మంచి జీవితం గడపాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.మాధవి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వారి సహాయంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి మాధవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్ఐవీ బారిన పడిన బాధితులకు సివిల్ సప్లయీస్ డిపార్ట్‌మెంట్ వారి సహాయంతో హైరిస్క్ గ్రూపునకు ప్రతినెలా 10కేజీల బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ప్రతీ ఏడాది డిసెంబర్ 3న జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విపిన్, మెడికల్ ఆఫీసర్ పోరిక చంద్రకాంత్, డాక్టర్ పవన్‌కుమార్, బి. తిరుపతయ్య, చీఫ్ లీగల్ ఎయిడ్స్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మేకల మహేందర్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ, తన గెలుపు ఆకాంక్షిస్తూ నిరంతరం శ్రమించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గండ్ర సత్యనారాయణరావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందన్నారు. భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలువబోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కొంతమంది ప్రభుత్వ అధికారులు బీఆర్ఎస్ పార్టీకి ఏజెంట్లుగా పనిచేస్తున్నారని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, పట్టణ కౌన్సిలర్లు కురిమిళ్ల రజిత - శ్రీనివాస్, ముఖ్య నాయకుడు క్యాతరాజు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

ఓడేదెవరో.. గెలిచేదెవరో!?

అంచనాల్లో తలమునకలైన నేతలు

- విజయంపై అన్ని పార్టీల అభ్యర్థుల ధీమా
- ఎక్కువ సీట్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్..
- వరంగల్ తూర్పుపై బీజేపీ నేతల ఆశలు
- అనుచరులతో పోలింగ్ శాతంపై చర్చలు
- సొంత లెక్కల్లో మునిగి తేలిన అభ్యర్థులు
- ప్రజామోదం ఎవరికో.. నేడు 'తీర్పు-2023'



సాక్షి ప్రతినిధి, వరంగల్: అగ్రనేతలు అటా.. ఇటా..? బీఆర్ఎస్ దిగ్గజాలు 2023 సార్వత్రిక ఎన్నికల గండం నుంచి గట్టెక్కుతారా? మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్.. మాజీ మంత్రి కడియం శ్రీహరి, డీఎస్ రెడ్యానాయక్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరుల పరిస్థితి ఏమిటీ? కాంగ్రెస్ నుంచి పోటీ పడుతున్న మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తదితరుల వ్యూహం ఫలిస్తుందా? బీజేపీ ఎన్ని స్థానాలు గెలుచుకుంటుంది? గెలిచే అవకాశం లేకుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఓటములపై బీజేపీ ప్రభావం ఎంత? పోటాపోటీగా బరిలో నిలిచిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు దక్కుతాయి? క్రాస్ ఓటింగ్ ప్రభావం ఎంత.. ఏ మేరకు, ఏ పార్టీకి చేటు తెస్తుంది? కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల ధీమా ఏ మేరకు ఫలిస్తుంది?.. ఇవన్నీ ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న చర్చలు. ప్రతిష్టాత్మకంగా మారిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల పోరులో ఎవరెవరు.. ఎక్కడెక్కడి నుంచి గెలుస్తారు? ఓడుతారు? అన్న చర్చ సర్వత్రా సాగుతోంది. తమ అనుచరులు, నాయకులు, కార్యకర్తలతో పోలింగ్ శాతం, సరళిపై రెండు రోజులుగా ఆరా తీస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు సొంత లెక్కల్లో మునిగి తేలారు. అందరు అభ్యర్థులు కూడా గెలుపు ధీమానే వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎవరికి అనుకూలం? మరెవరికి ప్రతికూలం? అన్నది హాట్ టాఫిక్‌గా మారింది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి జరిగే ఓట్ల లెక్కింపుతో ఉత్కంఠకు తెరపడనుంది.

ఐదు స్థానాలపై అందరి దృష్టి..

తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి జరుగుతున్న ఎన్నికల్లో ఉద్దండుల పోటీ హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి వరంగల్ పరిధి 12 అసెంబ్లీ స్థానాలకు పోటీ రసవత్తరంగా సాగినప్పటికీ.. రాష్ట్ర రాజకీయాలను ఆకర్షించే ఐదుగురి గెలుపు ఓటములపై చర్చ కీలకంగా మారింది. పాలకుర్తి, డోర్నకల్, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లో గెలుపు ఓటములపై ప్రత్యేకంగా చర్చ జరుగుతోంది. 1983లో ఒక్కసారి మినహా ఓటమి ఎరుగని నేతగా ఏడు పర్యాయాలు విజయం సాధించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈసారి గట్టిపోటీని ఎదుర్కొన్నారు. ఆయనపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మామిడాల యశస్వినిరెడ్డి పోటీలో ఉన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శనిగరం ఇందిర మధ్య పోటీ ప్రతిష్టాత్మకంగా మారింది. ఇక్కడి ఫలితాలపై కూడా అందరి దృష్టి ఉంది. రైతుబంధు సమితి అధ్యక్షుడిగా వ్యవహరించిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి.. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని కాదని బీఆర్ఎస్ అధిష్టానం జనగామ టికెట్ ఇచ్చింది. ఇక్కడ రాజేశ్వర్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాపరెడ్డి మధ్య పోటీ నువ్వా.. నేనా అన్న రీతిలో ఉంది. ఇక ఒకటి, రెండుసార్లు ఓడినా.. ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయపరంపర కొనసాగించిన డీఎస్ రెడ్యానాయక్ ఈసారి డోర్నకల్ నుంచి పోటీ చేశారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థిగా రామచంద్రు నాయక్ పోటీలో ఉన్నారు.

మరో ఏడు స్థానాలపై ఉత్కంఠ..

పోలింగ్ ముగిసిన తర్వాత వెలువడిన ఎగ్జిట్ పోల్ సర్వేలపై మొదలైన తర్జన భర్జనల నేపథ్యంలో మరో ఏడు స్థానాలపైనా ఉత్కంఠ కొనసాగుతోంది. ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడైన ఫలితాలు ఏ మేరకు నిజమవుతాయన్న చర్చ జరుగుతోంది.

- వరంగల్ పశ్చిమలో బీఆర్ఎస్ నుంచి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కాంగ్రెస్ నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి రావు పద్మ పోటీలో ఉన్నారు. అయితే వినయ్‌భాస్కర్, రాజేందర్‌రెడ్డి మధ్య నువ్వా, నేనా అన్న రీతిలో పోటీ ఉన్నట్లు ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడైంది. చివరికి వీరిలో ఎవరిని విజయం వరిస్తుందో తెలియాలంటే మరికొన్ని గంటలు ఆగాల్సిందే.
- వరంగల్ తూర్పులో కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ, బీజేపీ నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీఆర్ఎస్ నుంచి నన్నపనేని నరేందర్ మధ్య పోటీ ఉంది. ఈ త్రిముఖ పోటీలో విజయం ఎవరిని వరిస్తుందనే చర్చ సర్వత్రా సాగుతోంది.
- ములుగు నుంచి ధనసరి సీతక్క(కాంగ్రెస్), బడే నాగజ్యోతి(బీఆర్ఎస్), అజ్మీరా ప్రహ్లాద్(బీజేపీ) బరిలో ఉన్నారు. అయితే ధనసరి సీతక్క, బడే నాగజ్యోతి మధ్య గట్టి పోటీ సాగింది.
- భూపాలపల్లి నియోజకవర్గంలో త్రిముఖపోటీ ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర సత్యనారాయణరావులతో సమానంగా బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి ప్రచారం నిర్వహించి గట్టి పోటీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు అవకాశం ఉందని ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించిన సంస్థలు ప్రకటించగా.. పోరు మాత్రం ముగ్గురి మధ్య హోరాహోరీగా సాగింది.
- వర్ధన్నపేట(ఎస్సీ) నియోజకవర్గం నుంచి అరూరి రమేష్(బీఆర్ఎస్), కేఆర్.నాగరాజు(కాంగ్రెస్), కొండేటి శ్రీధర్(బీజేపీ) పోటీ పడ్డారు. అరూరి రమేష్, కేఆర్.నాగరాజు మధ్య పోటీ ఉండగా.. బీఆర్ఎస్ అభ్యర్థి ఇక్కడ ముందంజలో ఉన్నట్లు ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడైంది.
- పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో 'ఎగ్జిట్' ఫలితాలు బీఆర్ఎస్‌కు అనుకూలతను చూపాయి. ఇక్కడినుంచి చల్లా ధర్మారెడ్డి(బీఆర్ఎస్), రేవూరి ప్రకాశ్‌రెడ్డి(కాంగ్రెస్), కాళీ ప్రసాద్‌రావు(బీజేపీ) బరిలో ఉన్నారు.
- నర్సంపేట నియోజకవర్గం ఫలితాలపై ఉత్కంఠ ఉంది. బీజేపీ నుంచి పుల్లారావు ఉన్నా.. పెద్ది సుదర్శన్‌రెడ్డి(బీఆర్ఎస్), దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్) మధ్యనే పోటీ ఉంది. ఇద్దరిలో ఎవరు గెలిచినా.. స్వల్ప మెజార్టీతోనే బయటపడే అవకాశం ఉందని సర్వేలు చెబుతున్నాయి.

ఉత్తీర్ణత శాతం పెంపొందించాలి

కాటారం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపొందించాలని ఏటూరునాగారం ఐటీడీఏ ప్యానల్ బృందం సభ్యులు సూచించారు. కాటారం మండలం మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం బృందం సభ్యులు సందర్శించారు. పాఠశాల పరిసరాలు, సౌకర్యాలు, ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనాభ్యాసన ప్రక్రియ, నమూనా తరగతుల బోధన, టీచింగ్ డైరీ, క్యుములేటివ్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. లోటుపాట్లను గుర్తించి తగు సూచనలు చేశారు. విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. కిచెన్, డైనింగ్, పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని చెప్పారు. విద్యార్థులకు సమస్యలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చడం పట్ల బృందం సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ బృందం సభ్యులతో పాటు ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, పీడీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్యానల్ బృందం సభ్యులు

వైద్య సిబ్బందికి టీఏ, డీఏ అందించాలి

ములుగు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల్లో విధులు నిర్వహించిన ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి తక్షణమే టీఏ, డీఏలు అందించాని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డీఎంహెచ్ఓ, కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ 2018 ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల దగ్గర మెడికల్ క్యాంపు డ్యూటీలు చేసిన ఆశా కార్యకర్తలకు అప్పుడు కేవలం రూ.500 చొప్పున టీఏ, డీఏలు ఇచ్చారని తెలిపారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో డ్యూటీలు చేసిన అందరికీ టీఏ, డీఏలు ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కలెక్టర్ అధికారులు ఆలోచించి మెడికల్ క్యాంపులో డ్యూటీ చేసిన ఆశా కార్యకర్తలకు టీఏ, డీఏలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నీలాదేవి, జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన రవిగౌడ్, జిల్లా కమిటీ సభ్యురాలు బోడ శిరీష తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

సీతక్క గెలవాలని పూజలు

ములుగు రూరల్: ములుగు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి సీతక్క గెలవాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శానబోయిన అశోక్ ఆధ్వర్యంలో గట్టమ్మకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిట్ల కొమురయ్య, పత్తి రాజమొగిలి, కర్నే రతన్, వేల్పుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పడితే...ప్రమాదమే!

వాతావరణంలో మార్పులతో మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని నల్లకొండ పోచమ్మ వద్ద పచ్చని చెట్టు పూర్తిగా ఎండిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఆ దారి వెంట వెళ్లే వారిపై ఎండిన చెట్టుకొమ్మలు విరిగి పడే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డువైపు ఉన్న కొమ్మలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరుగక ముందే చర్యలు తీసుకోవాలని పలువురు కాలనీవాసులు కోరారు.

- కాళేశ్వరం

క్లుప్తంగా

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నీ ఆర్గనైజర్ పొడాల రామయ్య తెలిపారు. ప్రతి జిల్లా నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికల ఒక్కో జట్టు ఈ పోటీల్లో పాల్గొంటుందన్నారు. పొడాల వీరమల్లమ్మ-ఎల్లయ్య దంపతుల స్మారకార్థం పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి బొబ్బిలి వెంకటరెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కై లాశ్‌యాదవ్, హెచ్‌ఎం వై.సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

'సౌత్‌జోన్' టోర్నమెంట్లకు ఎంపికలు

కేయూ క్యాంపస్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీల టోర్నమెంట్లకు కేయూ జట్ల క్రీడాకారులను (మెన్, ఉమెన్స్) ఎంపిక చేసేందుకు తలపెట్టిన టోర్నమెంట్ల తేదీల సర్క్యులర్‌ను కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ ఆచార్య శ్రీనివాసరావు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపించారు. ఈనెల 1, 2తేదీల్లో వాలీబాల్ (ఉమెన్) టోర్నమెంట్ ఎంపికలు కేయూ క్రీడా మైదానంలో నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థినులు పాల్గొనగా ప్రతిభావంతులను సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంటుకు కేయూ జట్టుగా ఎంపిక చేశారు. ఈనెల 4, 5 తేదీల్లో ఫుట్‌బాల్ (మెన్), 4న బ్యాడ్మింటన్ (ఉమెన్), 5, 6 తేదీల్లో బ్యాడ్మింటన్ (మెన్), బాస్కెట్‌బాల్ (ఉమెన్), 11, 12 తేదీల్లో టేబుల్ టెన్నిస్ (ఉమెన్), 14, 15 తేదీల్లో వాలీబాల్ (మెన్), 14, 15, 16 తేదీల్లో ఖోఖో (మెన్ అండ్ ఉమెన్), 18, 19 తేదీల్లో హాకీ (మెన్), హ్యాండ్‌బాల్ (మెన్), 20, 21 తేదీల్లో హ్యాండ్‌బాల్ (ఉమెన్) టోర్నమెంట్లకు కేయూ జట్లను ఎంపిక చేస్తారు. ఆయా తేదీల్లో సంబంధిత క్రీడాకారులు కేయూలోని స్పోర్ట్స్ బోర్డులో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. 17 నుంచి 25 ఏళ్ల వరకు వయసున్న క్రీడాకారులు అర్హులు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు టెన్త్, ఇంటర్, ప్రీవియస్ ఇయర్ స్టడీ మెమోలు లేదా హాల్ టికెట్లు, ఐడీ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలి. ప్రిన్సిపాళ్లు ఆయా క్రీడల ఎంపికల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని పీడీలకు, విద్యార్థులకు తెలపాలని స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ శ్రీనివాస్‌రావు సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

రైళ్ల సర్వీస్‌లు రద్దు.. దారిమళ్లింపు

- మూడో రైల్వే లైన్ నిర్మాణంతో దక్షిణ మధ్య రైల్వే అధికారుల నిర్ణయం
- వరంగల్ సెక్షన్‌లో మెగా రైల్వే ట్రాఫిక్ బ్లాక్



కాజీపేట రూరల్: ప్రయాణికులు ముఖ్య గమనిక. కాజీపేట-విజయవాడ మార్గంలోని వరంగల్-చింతలపల్లి, విజయవాడ-గూడూరు రైల్వే స్టేషన్ల మధ్య మూడో రైల్వే లైన్ ప్యాచ్ ట్రిపిలింగ్ వర్క్ కారణంగా రైల్వే అధికారులు ట్రాఫిక్ బ్లాక్ చేపట్టారు. ఈ ట్రాఫిక్ బ్లాక్‌తో ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే పలు రైళ్ల రద్దు, మళ్లింపు, కుదింపు అయ్యాయి. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్ల రద్దు, మళ్లింపు, కుదింపు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

గుంటూరు-సికింద్రాబాద్(12705) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 10 నుంచి 18వ తేదీ వరకు, విజయవాడ-సికింద్రాబాద్(12713), సికింద్రాబాద్-విజయవాడ (12714) ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 7వ తేదీ, 10 నుంచి 18వ తేదీ వరకు, సికింద్రాబాద్-భద్రాచలం రోడ్(17659) కాకతీయ ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 6, 10 నుంచి 18వ తేదీ వరకు, భద్రాచలంరోడ్-సికింద్రాబాద్ (17660) కాకతీయ ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 7, 11 నుంచి 19వ తేదీ వరకు, తిరుపతి-ఆదిలాబాద్(17405) కృష్ణా ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 5 నుంచి 19వ తేదీ వరకు, ఆదిలాబాద్-తిరుపతి (17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 4, 6 నుంచి 20వ తేదీ వరకు, కాజీపేట-డోర్నకల్ (07753) పుష్‌పుల్, డోర్నకల్-కాజీపేట (07754) పుష్‌పుల్, డోర్నకల్- విజయవాడ (07755) పుష్‌పుల్, విజయవాడ-డోర్నకల్ (07756) పుష్‌పుల్ డిసెంబర్ 10 నుంచి 18వ తేదీ వరకు, కాకినాడ-లింగంపల్లి (12775) మంగళ, గురు, ఆదివారాల్లో వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10,12,14,17 తేదీల్లో, లింగంపల్లి-కాకినాడ (12776) సోమ, బుధ, శుక్రవారాల్లో వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11,13,15,18 తేదీల్లో, కాజీపేట-తిరుపతి (07091) ప్రతి మంగళవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కాజీపేట (07092) ప్రతి మంగళవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5,12,19 తేదీల్లో, షాలిమార్-సికింద్రాబాద్ (22849) ప్రతి బుధవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13న సికింద్రాబాద్-షాలిమార్ (22850) ప్రతి శుక్రవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈనెల 15న రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

వరంగల్ మీదుగా వెళ్లే రద్దయిన రైళ్లు

వరంగల్ మీదుగా ప్రయాణించే గోరఖ్‌పూర్-కొచ్చివెల్ (12511) ప్రతి గురు, శుక్ర, ఆదివారాల్లో వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10,14,15,17వ తేదీల్లో, కొచ్చివెల్-గోరఖ్‌పూర్ (12512) ప్రతి మంగళ, బుధ, ఆదివారాల్లో వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6,12,13,17వ తేదీల్లో, ఎర్నాకుళం-నిజాముద్దీన్ (12645) ప్రతి శనివారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16న, నిజాముద్దీన్-ఎర్నాకుళం (12646) ప్రతి మంగళవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18న, బిలాస్‌పూర్-ఎర్నాకులం (12851) ప్రతి ఆదివారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17న, ఎర్నాకులం-బిలాస్‌పూర్ (12852) ప్రతి సోమవారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18న రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

తాత్కాలికంగా రద్దయిన రైళ్లు

గుంటూరు-సికింద్రాబాద్ (17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11, నుంచి 19 వరకు గుంటూరు-కాజీపేట మధ్య రద్దు, సికింద్రాబాద్-గుంటూరు (17202) వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10 నుంచి 18 వరకు గుంటూరు-కాజీపేట మధ్య రద్దు, భద్రాచలంరోడ్-బల్లార్షా (17033) సింగరేణి ఈ నెల 6,7,8,10 నుంచి 18వ తేదీ వరకు భద్రాచలంరోడ్-హసన్‌పర్తి మధ్య రద్దు, సిర్పూర్-భద్రాచలంరోడ్ (17034) వెళ్లే సింగరేణి ప్యాసింజర్ ఈ నెల 5,6,7,9,17వ తేదీల్లో హసన్‌పర్తి-భద్రాచలంరోడ్ మధ్య తాత్కాలికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

దారి మళ్లింపు

వరంగల్ మీదుగా వెళ్లే త్రివేండ్రం-న్యూఢిల్లీ (12625) ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ-త్రివేండ్రం (12626) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 16,17న వయా గుంతకల్, సికింద్రాబాద్, కాజీపేట మీదుగా, టెర్నిమ్-బిలాస్‌పూర్ (22620) ఎక్స్‌ప్రెస్, బిలాస్‌పూర్-తెర్నిమ్ (22851) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17న వయా గుంతకల్, కాజీపేట మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. మరికొన్ని రైళ్లను రీషెడ్యూల్, రెగ్యులేషన్, అప్ ట్రిప్పు, డౌన్ ట్రిప్పులకు కొన్ని స్టేషన్లలో హాల్టింగ్‌లను ఎత్తివేసినట్లు అధికారులు తెలిపారు.

ఫుడ్‌పాయిజన్.. కార్మికుడి మృతి

- మరో 8 మంది ఆస్పత్రికి తరలింపు
- లింగగిరిలో ఇటుక బట్టీ వద్ద ఘటన

చెన్నారావుపేట: ఫుడ్‌పాయిజన్ కావడంతో ఇటుక బట్టీ వద్ద ఓ ఒడిశా కార్మికుడు మృతి చెందారు. ఈ ఘటన శనివారం మండలంలోని లింగగిరిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గణేష్ ఇటుక బట్టీ నిర్వహిస్తున్నాడు. ఇందులో ఒడిశా రాష్ట్రానికి చెందిన 17 మంది కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు శుక్రవారం మాంసం వండుకుని తిన్నారు. రాత్రి 9 మందికి ఫుడ్ పాయిజన్ అయింది. వెంటనే తోటి కార్మికులు యజమాని గణేష్‌కు తెలుపగా ఆయన 108కు సమాచారం అందించారు. 108 వచ్చేలోగా ఒడిశాలోని కుట్టివలి గ్రామానికి చెందిన చౌకీలాల్ (55) అక్కడిక్కడే మృతి చెందాడు. మిగతా 8 మందిని చికిత్స నిమిత్తం నర్సంపేట తరలించారు. కార్మికుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి భద్రపరిచారు. మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించామని, వచ్చిన తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై మహేందర్ తెలిపారు.



చికిత్స పొందుతున్న కార్మికులు

గల్లాపెట్టె గలగల..

ఆర్టీసీకి కలిసొచ్చిన పోలింగ్..

- సాధారణంగా మూడు రోజుల్లో రావాల్సిన ఆదాయం రూ.4. 80 కోట్లు
- వచ్చింది రూ.5,94,38,718 కోట్లు
- అదనపు ఆదాయం రూ.1,14,38,718 కోట్లు



హన్మకొండ: తెలంగాణ శాసన సభ ఎన్నికలు టీఎస్ ఆర్టీసీకి కలిసొచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వలస ఓటర్లు గ్రామాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇది ఆర్టీసీకి లాభాలు ఇచ్చింది. నవంబర్ 30న పోలింగ్ జరగగా, 29 నుంచి వలస ఓటర్లు స్వగ్రామాల బాట పట్టారు. దీంతో ఆర్టీసీ గల్లాపెట్టె గలగలమంటోంది. ప్రధాన పండుగలకు తరలివచ్చినట్లుగానే శాసన సభ పోలింగ్‌కు భారీగా తరలిరావడంతో ఆర్టీసీకి ప్రయాణికులు పోటెత్తారు. దీంతో అధికారులు అదనపు బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేసి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేశారు. ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు సాధారణంగా రోజూ రూ.1.60 కోట్ల ఆదాయం వస్తుంది. కాగా, పోలింగ్ ముందు రోజు నవంబర్ 29న రీజియన్‌లో రూ.1,99,04,959, 30న రూ.1,84,25,665, డిసెంబర్ 1న రూ.2,11,08,094 ఆదాయం వచ్చింది. రెండు రోజుల్లో స్వగ్రామాలకు వచ్చిన వారిలో ఈ నెల 1న చాలా మంది తిరుగు ప్రయాణం కావడంతో మిగతా రెండు రోజులను మించి ఆదాయం వచ్చింది.

వరంగల్ రీజియన్‌లో డిపోల వారీగా ఆదాయం

డిపో	గత నెల 29న	గత నెల 30న	డిసెంబర్ 1న
హనుమకొండ	రూ.25,13,262	రూ.18,91,222	రూ.27,93,900
జనగామ	రూ.18,79,780	రూ.25,09,343	రూ.22,91,635
వరంగల్-1	రూ.32,62,267	రూ.29,18,138	రూ.36,37,155
వరంగల్-2	రూ.24,84,563	రూ.31,90,349	రూ.30,79,231
మహబూబాబాద్	రూ.17,85,032	రూ.11,52,841	రూ.13,88,399
నర్సంపేట	రూ.22,21,698	రూ.19,13,765	రూ.20,12,185
పరకాల	రూ.15,00,528	రూ.12,93,439	రూ.15,48,692
తొర్రూరు	రూ.25,75,311	రూ.18,26,787	రూ.23,49,978
భూపాలపల్లి	రూ.16,82,518	రూ.17,29,781	రూ.20,06,919

కసితీరా కాటు..

- కోటలో వీధికుక్కల స్వైర విహారం
- ఒకే రోజు ముగ్గురిపై దాడి..
- తీవ్ర గాయాలు..ఎంజీఎంకు తరలింపు
- స్పందించిన బల్దియా అధికారులు
- వీధికుక్కల పట్టివేత



కుక్కలు కాటువేయడంతో తీవ్రంగా గాయపడిన విఠల్

ఖిలా వరంగల్: వీధి కుక్కలు కసితీరా కాటు వేశాయి. వెంటాడి వేటాడి ముగ్గురిపై వేర్వేరు చోట్ల దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటన ఖిలా వరంగల్ మధ్యకోట, పడమరకోటలో వేర్వేరు చోట్ల జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మధ్యకోటకు చెందిన వనపర్తి విఠల్ శనివారం ఉదయం వాకింగ్ కోసం ఇంటి నుంచి బయటకు రాగా ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేసి చేయి, కాళ్లు, ముక్కు తదితర భాగాల్లో తీవ్రంగా గాయపరిచాయి. దీంతో విఠల్ కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని కుక్కలను తరిమేయడంతో ప్రాణపాయం నుంచి తప్పుకున్నాడు. అదే క్షణంలో పడమరకోట జంక్షన్‌లో కూరగాయల మార్కెట్ వెళ్లేందుకు ఆటో స్టాండ్ వద్ద నిలబడిన ఓ మహిళపై దాడి చేయగా సహ ప్రయాణికులు రాళ్లు, కర్రతో బెదిరించడంతో కుక్కలు పారిపోయాయి. అలాగే, పడమరకోట ఎస్టీ వాడకు చెందిన బల్దియా పారిశుద్ధ్య కార్మికురాలు కంప ఎల్లమ్మ.. ఉదయం ప్రధాన రహదారిని శుభ్రం చేస్తుండగా ఆమెపై కుక్కలు దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో సహ కార్మికులు హుటాహుటినా 108లో ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం ముగ్గురు క్షతగాత్రుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



పారిశుద్ధ్య కార్మికురాలు ఎల్లమ్మను ఎంజీఎంకు తరలిస్తున్న తోటి కార్మికులు

వీధికుక్కల పట్టివేత

ఖిలా వరంగల్ మధ్య, పడమరకోటలో శనివారం కుక్కలు వేర్వేరు చోట్ల ముగ్గురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటనపై స్థానికుల ఫిర్యాదు మేరకు బల్దియా అధికారులు స్పందించారు. కార్పొరేటర్ ఉమ పర్యవేక్షణలో వీధికుక్కలను పట్టి సంరక్షణ కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో జవాన్ కుమారస్వామి,కార్మికులు పాల్గొన్నారు.

ఐనవోలులో షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ

ఐనవోలు: మండల కేంద్ర పరిసరాల్లో 'బాబుగాడంటే' అనే షార్ట్ ఫిల్మ్‌ను చిత్రీకరిస్తున్నారు. కాగా, ఫిల్మ్ డైరెక్టర్ రాధాకృష్ణ, నిర్మాత, హీరో మహేంద్ర సత్య చేదెళ్ల ఆహ్వానం మేరకు వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శనివారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులను అభినందించారు. మరిన్ని సినిమాలు తీసి ఐనవోలు ఆలయ ప్రాముఖ్యత నలుదిశలకు చేరేలా యూనిట్ సభ్యులు పబ్లిసిటీ చేయాలన్నారు. షార్ట్ ఫిల్మ్‌లో హీరోయిన్‌గా లాస్య, కేతిరి సుధాకర్‌రెడ్డి(బలగం కొమురయ్య), ఇంజవెల్లి శ్రీనివాస్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. అసోసియేట్ డైరెక్టర్లుగా శివ కందుకూరి, కార్తీక్, కెమెరామెన్‌గా అరుణ్ కొలుగూరి వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్‌కుమార్, రైతుబంధు కోఆర్డినేటర్ మునిగాల సమ్మయ్య, సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్, తండా వెంకన్న, పరమేష్, రాజు, ముదురుకోల అనిల్, యాదగిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



షూటింగ్‌ను ప్రారంభిస్తున్న మార్నేని రవీందర్‌రావు

కార్లను ఢీకొన్న ప్రైవేట్ ఆస్పత్రి బస్సు

- మందపల్లి క్రాస్ వద్ద ఘటన
- రోగులు సురక్షితం..

దుగ్గొండి: హనుమకొండ జిల్లా దామెర గ్రామ శివారులోని ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రి బస్సు రెండు కార్లను ఢీకొన్న ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్నిబావి సెంటర్‌లో మందపల్లి క్రాస్ వద్ద చోటు చేసుకుంది. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. పోలీసుల కథనం ప్రకారం ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రికి చెందిన బస్సు వరంగల్ జిల్లాలోని ఖానాపురం మండలం దబ్బీర్‌పేట నుంచి 41 మంది రోగులను శనివారం ఉదయం ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షల అనంతరం సాయంత్రం దబ్బీర్‌పేటకు తీసుకెళ్తుండగా మందపల్లి క్రాస్‌లో నర్సంపేట నుంచి వస్తున్న రెండు కార్లను ఢీకొంది. అనంతరం ఓ మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. కార్లలోని ప్రయాణికులు, బస్సులోని రోగులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేష్ తెలిపారు.



మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లిన బస్సు

యువకుడి ఆత్మహత్య



సాయికిరణ్ (ఫైల్)

చిల్పూరు : యువతి ప్రేమకు నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని లింగంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మోతె సాయికిరణ్ (22) గ్రామంలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల ఓ యువతిని ప్రేమించమని వెంటపడగా ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన సాయికిరణ శనివారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు ..



గౌరయ్య మృతదేహం

చెన్నారావుపేట: ఆరోగ్యం సహకరించడం లేదనే కారణంతో ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని బోజేర్వులో జరిగింది. గ్రామానికి చెందిన రాదారపు గౌరయ్య(70) ఏడాది క్రితం కంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆరోగ్యం సహకరించడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన గౌరయ్య శుక్రవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడికి కుమారుడు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ శనివారం తెలిపారు.

కేయూలో రేపు కామన్ మెస్ ఓపెన్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీజీ, ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు సంబంధించి కామన్ మెస్, పద్మాక్షి మహిళా హాస్టళ్ల మెస్, సుబేదారిలోని 'లా' విద్యార్థుల హాస్టల్ మెస్ ఈనెల 4 నుంచి ఓపెన్ చేయనున్నట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య శనివారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత నెల 30న పోలింగ్ ఉండడంతో విద్యార్థులు ఓటు వేయడానికి స్వస్థలాలకు వెళ్లిపోయారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు గత నెల 28న సాయంత్రం నుంచి మూసివేసిన హాస్టళ్ల మెస్‌లను తిరిగి శనివారం నుంచి రీఓపెన్ చేయాలనుకున్నా విద్యార్థులు సరిపడా రాకపోవడంతో ఆయా మూడు మెస్‌లు ఓపెన్ చేయలేదని వెంకయ్య పేర్కొన్నారు. అయితే.. ఇంజనీరింగ్ విద్యార్థులు మాత్రమే రావడంతో వారికి సంబంధించిన మెస్ ఓపెన్ చేసినట్లు వివరించారు.

నాశనకారి.. 'నల్ల తామర'

పూతను ఆశిస్తున్న పురుగులు

- ఆందోళనలో మిర్చి రైతులు
- పెరుగుతున్న ఉధృతి
- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు



మిరప పూతలో ఉన్న నల్లతామర పురుగులు



నల్లతామర సోకిన మిరప మొక్క



నల్లతామర సోకిన మిరప పువ్వు

కరీమాబాద్: మిరప పంటకు 'నల్ల తామర' సోకుతోంది. పురుగులు మిరప పువ్వును ఆశిస్తూ పంట నష్టం చేస్తున్నాయి. దీంతో వేలాది రూపాయల పెట్టుబడితో మిరప పంట సాగు చేస్తున్న రైతులకు కంటి మీద కునుకు లేకుండాపోతోంది. పంట దిగుబడిపై చీడపీడల ప్రభావం ఎంతో కొంత ఉన్నప్పటికీ 'తామర' మాత్రం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. గతంలో జనవరి, ఫిబ్రవరిలో మిరప పంటలో వచ్చిన నల్ల తామర ఇప్పుడే ఉధృతమవుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మొత్తం 85 వేల హెక్టార్లలో రైతులు మిరప పంట సాగు చేస్తున్నారు. అయితే రైతులు మొక్కలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సమయానుకూలంగా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట నష్టం జరుగకుండా కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఎలా నష్టం కలిగిస్తుందంటే..

ఈ కొత్తరకం తామర పురుగులు పూతను ఎక్కువ సంఖ్యలో ఆశిస్తాయి. దీంతో పూత రాలిపోవడం, కాయగా మారకపోవడం జరుగుతుంది. ఈ రకం పురుగులు ముదురు నలుపు రంగులో ఉండి పురుగు మందులకు లొంగకుండా పూతను విపరీతంగా ఆశిస్తాయి. సాధారణంగా మిరప పంటలో తామర పురుగులు ఆకుల దిగువ భాగాన ఉండి రసం పీల్చుతాయి. తద్వారా ఆకులు పైకి ముడుచుకుంటాయి. దీనిని 'పై ముడత' అంటారు. దీనిని నివారించేందుకు స్పైనోసాడ్(ట్రేసర్), ఫ్రిప్రోనిల్ (రిజెంట్), డయాఫెన్ థయురాన్(పెగాసిస్), ఇంటర్‌ప్రిడ్, ఎసిటామిప్రైడ్, క్లోరోఫెన్‌పిల్ లాంటి మందులు వారం రోజుల వ్యవధిలో ఒకటి, రెండు సార్లు పిచికారీ చేయడం ద్వారా నివారించొచ్చు.

రైతులు వెంటనే తీసుకోవాల్సిన నివారణ చర్యలు..

1. రైతులు ఆందోళనకు గురై విపరీతంగా మందులు కొట్టొద్దు. అలా చేస్తే తామర పురుగులో గుడ్లు పెట్టే సామర్థ్యం ఎక్కువవుతుంది. సింథటిక్ పైరిథ్రాయిడ్ మందులు ఎక్కువగా పిచికారీ చేయొద్దు.
2. అన్ని రకాల పురుగుమందులను తట్టుకునే సామర్థ్యం ఈ పురుగులకు ఉంటుంది. అందుకే పురుగు మందుల ద్వారా నల్ల తామరను నివారించడం కష్టంగా మారుతుంది.
3. రైతులు సామూహికంగా ఎక్కువ సంఖ్యలో జిగురు పూసిన నీలిరంగు, పసుపురంగు అట్టలను 30 నుంచి 40 చేనులో పెట్టడం ద్వారా వీటి తల్లి పురుగులను నివారించుకునే అవకాశముంటుంది.
4. వయ్యారిభామ కలుపు మొక్కలు తామర పురుగులకు ఆవాసంగా ఉంటాయి. అందుకే రైతులు ఈ మొక్కలను చేనులో, చేనుచుట్టు లేకుండా చూసుకోవాలి.
5. తల్లి పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించడం కోసం వేప సంబంధిత పురుగు మందులను పిచికారీ చేయాలి. మోతాదు ప్రకారం వేప నూనె 10,000 పీపీఎం, ట్రై టాన్,సర్ఫ్ కలిపి పిచికారీ చేయాలి.
6. జీవ శిలీంద్రాలు బవేరియా బస్సియానా, లికానిసిలియం లికాని అనే జీవ, ట్రైటాన్ మందులు కలిపి పిచికారీ చేయాలి.
7. అవసరం బట్టి పురుగుమందులను మార్చిమార్చి పిచికారీ చేయాలి.
8. స్పినోటారం, ఎసటామిప్రై డ్, సైయాంట్రనిలిప్రోల్(బెవీనియా), ఫిప్రోనిల్, ఇమిడాక్లోప్రైడ్‌లు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



మిరప పంటలు పూత, కాత దశలో ఉన్న నేపథ్యంలో రెతులు అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు లేకపోవడం, పంటలు ఆలస్యంగా సాగుచేయడంతో గతేడాది జనవరి, ఫిబ్రవరిలో కనిపించిన నల్ల తామర ఇప్పుడే కనిపిస్తోంది. ప్రారంభ దశలో ఉన్న నేపథ్యంలో రైతులు పురుగు మందులు ఎక్కువగా పిచికారీ చేయొద్దు. అవసరం మేరకు వాడాలి.

-రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

క్లుప్తంగా

విజయోత్సవ ర్యాలీలు తీయొద్దు

ఏటూరునాగారం/కన్నాయిగూడెం/వెంకటాపురం(కె)/వాజేడు: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గెలిచిన అభ్యర్థికి సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు తీయరాదని ఎస్సైలు గుర్రం కృష్ణప్రసాద్, సరేష్, అశోక్, వెంకటేశ్వర్లు వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఒకే చోట గుమికూడి ఉండడం వల్ల చట్టరీత్యా నేరం అన్నారు. ఈనెల 5 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు.

వైద్య పరీక్షలు




మహాముత్తారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారి సందీప్ వైద్యసేవలు అందించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 90 మందికి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించారు. మరికొంత మందికి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



గంగారం: మండలంలోని జంగాలపల్లి గ్రామంలోని ధనసరి వారి ఇలవేల్పు అయిన సడలమ్మ దేవాలయంలో ములుగు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి అనసూయ (సీతక్క)భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, అశోక్, సమ్మయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'గండ్ర' గెలవాలని..



శాయంపేట : నేడు వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భారీ మెజారిటీతో గెలవాలని వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి శనివారం శ్రీబుగులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీబుగులోని వెంకటేశ్వర స్వామి కృపాకటాక్షంతో భారీ మెజార్టీతో గెలవాలని ఆమె ఆకాంక్షించారు.

నేడు లక్ష కార్తీక మహాదీపోత్సవం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన పారిజాతం, రాజేశ్వరరావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష కార్తీక మహాదీపోత్సవం నిర్వహిస్తున్నామని ఆహ్వాన నిర్వాహితులు మాలె నాగేశ్వరరావు, యోగేశ్వరరావు, లక్ష్మణరావు, శ్రవణ్ కుమార్, సమ్మారావు, నళిన్ కుమార్ శనివారం తెలిపారు. పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో ఆదివారం సాయంత్రం 6గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

కంటి వైద్యశిబిరం



గార్ల: శరత్ మ్యాక్సివిజన్ ఐ కేర్ ఆధ్వర్యంలో గార్లలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో కౌన్సిలర్ రవికుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆప్తాలమిక్ అసిస్టెంట్ పృథ్వీ, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్స్‌లో 'నేషనల్ పొల్యూషన్ డే'

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ కళాశాలలో నేషనల్ పొల్యూషన్ డే కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిట్స్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్బన పదార్థాలు ఎక్కువ వాడటం వల్ల వాతావరణంపై ప్రభావం చూపుతుందని సూచించారు. వివిధ విభాగాధిపతులు మనీష్, రవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కళాశాలలో నేషనల్ పాపులేషన్ డే పై అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను వివరించారు.

ముమ్మరంగా పోలీసు తనిఖీలు



మహదేవపూర్: తనిఖీలు చేస్తున్న పోలీసులు



వెంకటాపురం(కె): వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

మహాముత్తారం: మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా అటవీ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా మహాముత్తారం పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేశారు. మండలంలోని యామన్‌పల్లి, మహాముత్తారం, కోణంపేట తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారుల వద్ద మహాముత్తారం ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు కలిసి ముమ్మర తనిఖీలు చేపట్టారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్: మండలంలోని పెద్దంపేట, అంబట్‌పల్లి గ్రామల మధ్యలో శనివారం ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కాల్వర్టులను తనిఖీ చేశారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో గోదావరి తీరప్రాంతంలో, మేడిగడ్డ లక్ష్మీబ్యారేజ్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేశారు.

వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల గ్రామ సమీపంలో శనివారం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలను నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పూర్తి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.



మహాముత్తారంలో..

హరితహారం.. ఆగమాగం



కొమ్మల మధ్యలో విద్యుత్ తీగలు

- విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలు
- తరచూ కరెంట్ సరఫరాకు అడ్డంకి
- పట్టించుకోని సంబంధిత అధికారులు

చిట్యాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగల కిందనే హరితహారం మొక్కలను నాటారు. దీంతో మండల కేంద్రంలో నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో విద్యుత్ తీగలను కమ్మేశాయి. మండల అధికారులు ఇంత నిర్లక్ష్యంగా మొక్కలు నాటుతారా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హరితహారం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిచింది. దీంతో మొక్కలకు కేటాయించిన నిధులు వృథాగానే అయినట్లే అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా స్థానిక అధికారుల నిర్లక్ష్యం మూలంగా, ముందు చూపు లేక పోవడంతో మండల కేంద్రంలో తీగల కిందనే మొక్కలను నాటడం ఏంటనీ వారు ప్రశ్నిస్తున్నారు. తరచుగా విద్యుత్ సరాఫరాలో సమస్యలు వస్తుయని సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అలాగే బ్యాంక్ సమీపంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. ఏమైన ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజల కోరుతున్నారు.

అభ్యసనపై విద్యార్థులకు అవగాహన

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులకు అభ్యసన పద్ధతులపై అవగాహన కల్పించారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు తొలిమెట్టు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా వలంటరీలు ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి కబర్చేలా వలంటరీలు తమదైన శైలిలో విద్యాబోధన చేసి మెలుకువలు నేర్పించారు. ఆడుతూ పాడుతూ విద్యను అభ్యసిస్తే సులభంగా ప్రతి సబ్జెక్టును నేర్చుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి శనివారం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ వంగపల్లి పరుశురాములు, డాక్టర్ శ్రీనివాస్, రమేశ్, హెచ్ఎం జయరాజ్, ఉపాధ్యాయినీ గీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మద్యం ధరలకు రెక్కలు!



పేరు, నిబంధనల బోర్డు లేకుండా మద్యం షాపు



ఆటోలో బెల్ట్‌షాపులకు తరలిస్తున్న మద్యం

- మొదటి రోజే నిబంధనలను విస్మరించిన వైన్స్ యాజమాన్యం
- ఎమ్మార్పీ కంటే రూ.20 అధికం

ఏటూరునాగారం: నూతనంగా మద్యం షాపులను నెలకొల్పిన మొదటి రోజే మద్యం ధరలకు రెక్కలు వచ్చాయి. వైన్స్ యజమాన్యం ఇష్టానుసారంగా ధరలు పెంచి అమ్మకాలను కొనసాగించారు. రెండు నెలల క్రితం టెండర్ల ద్వారా మద్యం షాపులను దక్కించుకున్న యాజమాన్యం శనివారం మండల కేంద్రంలోని రామన్నగూడెం రోడ్డుకు నూతనంగా మద్యం షాపులను ఏర్పాటు చేశారు. షాపుల గేజిట్ నంబర్లు, షాపుల పేర్లు, నిబంధనలను పూర్తిగా అందరికి కనిపించేలా ఏర్పాటు చేసుకున్న తర్వాతనే మద్యాన్ని విక్రయించాల్సి ఉంది. కానీ ఏలాంటి షాపుల పేర్లు, గేజిట్ నంబర్లు, నౌకరినామ(మద్యం విక్రయించేదారుడిపేరు) లేకుండానే షాపును కొనసాగిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో గత నెల 28 నుంచి 30 వరకు ఎన్నికలకోడ్‌లో భాగంగా మద్యం షాపులను మూసివేశారు. దీంతో పాత యజమానుల లైసెన్స్ గడువు కూడా ముగిసింది.

అధిక ధరలు

వైన్స్ యాజమానులు మొదటి రోజు దందాను షురూ చేశారు. ఒక్కో క్వార్టర్‌కు ఎమ్మార్పీ కంటే రూ.20, బీర్లకు కూడా రూ.20 అధికం చేసి విక్రయిస్తున్నారు. అంతేకాకుండా మద్యాన్ని బెల్ట్‌షాపులకు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీంతో మద్యాన్ని కొనుగోలు చేసేందుకు బెల్ట్‌షాపుల దుకాణం దారులు పోటీపడ్డారు. పరిమితి స్టాక్ ఉండడంతో డిమాండ్‌గా విక్రయించడం పరిపాటిగా మారింది. అందులోను మూడు రోజులపాటు మూసివేసి ఉండడం వల్ల దీనినే అదును చూసుకొని మద్యం యజమానులు క్యాష్ చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

మద్యం దుకాణాలను తెరిపించే క్రమంలో నిబంధనలను పాటించే విధంగా చూడాల్సిన ఎక్సైజ్ అధికారులు మాముళ్ల మత్తులో ఉండి పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మద్యం ప్రియుల జేబులను కొల్లగొడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ ఫకీరాను వివరణ కోరగా ఈ విషయాన్ని పరిగనలోకి తీసుకొని విచారణ చేపడుతామని, నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రారంభమైన వరికోతలు



ముప్పనపల్లిలో వరి కోస్తున్న హార్వెస్టర్

కన్నాయిగూడెం: మండలంలో వారం రోజుల నుంచి వరికోతలు ప్రారంభమయ్యాయి. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోడం, మబ్బులు వస్తుండటంతో రైతులు ఆందోళన పడుతున్నారు. దీంతో కోతలను ముమ్మరం చేస్తుడటంతో హార్వెస్టర్లకు డిమాండ్ పెరిగింది. ధాన్యం ఎండబెట్టనికి కల్లాలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది రైతులు పొలాల్లోనే పోస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కల్లాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందిస్తున్న యూత్ సభ్యులు

టేకుమట్ల: మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన మోరె భద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను అంబేడ్కర్ యూత్ సభ్యులు శనివారం పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. యూత్ సభ్యులు ఆరుముళ్ల రత్నాకర్, సంగి రవివర్మ, కల్యాన్, సంగి సందీప్, సంగి రాజశేఖర్, మహేందర్, గసిగంటి రాజు, అరుణ్, శ్రావన్, సురేష్, మధూకర్, నైనస్, లెనిన్, చరణ్, పవన్‌కల్యాణ్, సాగర్, పొలు, చంద్రయ్య, సమ్మయ్య, జితేందర్, తదితరులు ఉన్నారు.

శాయంపేటలో..



బియ్యం అందజేస్తున్న సభ్యులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రాజోలు రాజవీరు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా శనివారం సూర్యోదయ ట్రస్ట్ చైర్మన్ కనకం జయసూర్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా 50 కేజీల బియ్యం, రూ. 2వేల విలువగల నిత్యవసర సామాగ్రిని అందించారు. కోమనేని రఘు, అమ్మ అశోక్, ఉమేష్ ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప దివ్య పడిపూజ



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాతలు



అయ్యప్పస్వామి ఆలయంలో 18మెట్లకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో శనివారం పుష్పాభిషేకం, దివ్య పడిపూజ, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివ్య పడిపూజ, మహా అన్నదాతలుగా మాలె రవి,సరిత వ్యవహరించగా ఆలయ నిత్య అర్చకులు దేవేష్‌మిశ్రా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలే సుజాతకనకయ్య, గన్నేపల్లి కృష్ణమూర్తి, వేంశెట్టి శ్రీనివాస్, దొండేటి శ్రీనివాస్‌రావుసుజాత, పొన్నం గణేష్‌మౌనిక, సల్ల నరేందర్‌విజయలక్ష్మి, నల్ల సుధాకర్‌రెడ్డిభారతి, వడ్డేపల్లి సారంగపాణినీరజ, సంతోష్‌హరిణి, రాజేష్, సురేష్, దార ప్రశాంత్‌సుమలత, మాదారపు చంద్రశేఖరం, దొడ్డ రవీందర్, శ్రీరాంతఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

దామెర: అభివృద్ధి పనులపై అలసత్వం వహించొద్దని ఎంపీపీ కాగితాల శంకర్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో భాగంగా అధికారులు ప్రగతి నివేధికను చదివి వినిపించారు. అనంతరం ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానమిచ్చారు. మండలంలో ఏర్పాటు చేసిన వైకుంఠ దామాల్లో 50శాతం విద్యుత్ పనులు పూర్తి చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ గుర్రం రమేష్ తెలిపారు. పలు గ్రామాల్లో నూతన డీటీఆర్‌లు, స్తంభాలు మంజూరు అయ్యాయని, వాటిని త్వరలోనే బిగిస్తామని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అయ్యాయని, పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని పీఆర్ డీఈ లింగారెడ్డి వెల్లడించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పెడింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కల్పనకృష్ణమూర్తి, ఎంపీడీఓ కాసర్ల రవీందర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీలు గందు రాము, సంగరబోయిన మానికకిరణ్, సంధ్యఅశోక్, వివిధ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

పరకాల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు పరకాల నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని స్వర్ణ గార్డెన్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నవంబర్ 30న జరిగిన పోలింగ్‌లో ప్రజల నాడీని పరిశీలిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఊహించని వ్యతిరేకత కనిపించిందన్నారు. ఎంతో కాలంగా బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు ఎదురుచూశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు కేసీఆర్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పరకాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన గెలుపు కోసం కృషి చేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దొమ్మాటి సాంబయ్య, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ జయమ్మ, చందర్, శ్రీనివాస్, రాంమూర్తి పాల్గొన్నారు.



పరకాల : మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

రైతులకు 'మిచాంగ్' గుబులు

- పూర్తికాని వరి కోతలు
- కల్లాల్లో ధాన్యంతో అన్నదాత ఆగమాగం

సంగెం : పచ్చని మగాణిలో సిరులు కురిసింది.. అన్నదాతల ఆశల పంట పండింది.. ఆరుగాలం కష్టపడి పండించిన వరిచేలు కోతకు వచ్చాయి.. కానీ, పండించిన ధాన్యం చేతికి వచ్చేదేలా? అని అన్నదాతలకు ఆందోళన మొదలైంది. మిచాంగ్ తీవ్ర తుఫాన్ ప్రభావం కారణంగా మబ్బులు పట్టడంతో రైతులకు మరింత గుబులు పట్టుకుంది. సంగెం మండలంలో వరి కోతలు కొనసాగుతున్నాయి. వాన మబ్బులను చూసి రైతులు వరి ధాన్యం కల్లాల్లో తడవకుండా రాసులు పోసుకుంటున్నారు. సంగెం, కుంటపల్లి, ఎల్గూర్‌రంగంపేట, కాపులకనిపర్తి, వెంకటాపూర్, కాట్రపల్లి, ఆశాలపల్లి, మొండ్రాయి, నల్లబెల్లి, పల్లారుగూడ తదితర చెరువుల కింద సాగు చేసిన వరి కోతకు వచ్చింది. అలాగే కోసిన ధాన్యంను ఎలా కాపాడుకోవాలోనని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వరి ధాన్యం ఆరబెట్టడానికి అనువైన స్థలం లేక, మంచు, వాన నుంచి కాపాడుకోవడానికి సరిపోను టార్పాలిన్లు షీట్లు లేక ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ తీవ్రత ఎక్కువై అకాల వర్షం కురిస్తే అన్నదాతలకు భారీ నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళనతో ఆకాశం వైపు దీనంగా చూస్తు రోదిస్తున్నారు.



ఎల్గూర్‌రంగంపేట చెరువు కింద కోయని వరి పంటలు

బాధిత కుటుంబానికి పరామర్శ

ములుగు రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ఐయిత రాజయ్య శనివారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలనిప్పుల భిక్షపతి పరామర్శించి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి అనిల్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బోడ రఘు, పార్టీ జిల్లా నాయకులు కోకిల రాంబాబు, ఓరుగంటి కృష్ణ, బోడ సతీష్, శ్రావణ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు